క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి వీరబ్రహ్మంగారి ఆలయ నిర్మాణానికి వి.గోపాలచారి, వడ్ల శంకర్‌లు రూ.11,116 చొప్పున విరాళం అందజేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.సంగయ్యచారి, కార్యదర్శి రమేష్‌లు తెలిపారు. గోపాలచారి గతంలోనూ ఆలయ అభివృద్ధికి నిధులు అందజేసినట్టు వారు పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయానికి..

పిట్లం(జుక్కల్): పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంభపూర్ గ్రామానికి చెందిన ఓం ప్రకాష్ శిల్ప, వడ్డేపల్లి గ్రామానికి చెందిన సురేందర్‌లు ఆలయ భూదానం కోసం నగదు విరాళాన్ని ఆలయ నిర్వాహకులు తేజ స్వామికి అందజేశారు.

లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివద్ధి కోసం సదాశివనగర్ మండలం కల్వరాల గ్రామానికి చెందిన స్వామి రూ.22వేలు విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను శాలువా కప్పి సత్కరించారు.

ఐకేపీ కార్యాలయంలో ఆడిట్

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ ఐకేపీలో మంగళవారం అధికారులు ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 సంవత్సరానికి సంబంధించిన లావాదేవీలను పరిశీలించారు. ఆడిటర్ రమేష్, డీపీఎం సుధాకర్, ఏపీఎం గంగాధర్, సీసీ పండరి, తదితరులు ఉన్నారు.

పోస్టు కార్డు ఉద్యమం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ వారు మంగళవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులను పంపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శంకర్, వెంకట్‌రాములు తదితరులున్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట నిరసన

బీబీపేట: ప్రేమించి మోసం చేసిన యువకుడి ఇంటి ఎదుట కొనసాగుతున్న నిరసన దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. వివరాలు.. దోమకొండకు చెందిన మెతుకు మౌనిక, తుజాల్‌పూర్‌కి చెందిన అందె నాగరాజ్‌గౌడ్ ఇద్దరూ ఆరేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. పెళ్లి అనగానే నాగరాజ్ తప్పించుకొని తిరుగుతుండటంతో ప్రియురాలు రెండు రోజులుగా కుటుంబసభ్యులతో కలిసి నాగరాజ్ ఇంటి వద్ద నిరసన తెలుపుతున్నారు.

లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మృతి

కామారెడ్డి అర్బన్: లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ జూకంటి వెంకటేశ్వరరావు(60) సోమవారం ఆకస్మికంగా మృతి చెందినట్టు క్లబ్ ఏరియా సమన్వయకర్త ఎం.రాజన్న తెలిపారు. వెంకటేశ్వరరావు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

దళితుల ఆందోళన

కామారెడ్డి టౌన్: పట్టణంలోని హరిజనవాడ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అడ్డుకున్న నేపథ్యంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణ సీఐతో పాటు అధికారులు విగ్రహాన్ని ఏర్పాటును అడ్డుకోవడం సరికాదన్నారు. బీజేపీ నేతలు సుతారి రవి, విపుల్, హన్మాండ్ల సురేష్, ఆకుల భరత్, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు మద్దతు తెలిపారు.

లైసెన్స్ ఫీజుల్ని వసూలు చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంచాయతీ పరిధిలోని వివిధ రకాల దుకాణాల లైసెన్స్ ఫీజులను వెంటనే వసూలు చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ ఆదేశించారు. గోపాల్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు.

ఆర్టిజన్ల ముందస్తు అరెస్ట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన సమ్మెలో పాల్గొనకుండా ఉండేందుకు నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యుత్ ఆర్టిజన్లను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని వదిలిపెట్టారు.

బాన్సువాడ పరిధిలో..

బాన్సువాడ : బాన్సువాడలో కూడా ఆర్టిజన్లను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. బాన్సువాడ, పిట్లం, నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

రోగులకు సరైన వైద్యం అందించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సహనంతో, సరైన వైద్యం అందించాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో రఘు సూచించారు. స్థానిక పీహెచ్‌సీని మంగళవారం వారు తనిఖీ చేశారు. ఇటీవల నూతనంగా విధుల్లో చేరిన డాక్టర్ సృజన్‌కుమార్‌ను కలిసి ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి వారు తెలుసుకున్నారు.

'మలేరియా'ను తరిమేద్దాం



భిక్కనూరులో..



హన్మాజీపేట్‌లో..



గోపాల్‌పేటలో..



రామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి నెట్‌వర్క్ : ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలో పలు చోట్ల వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. అవగాహన పెంచుకుని మలేరియాను తరిమేద్దామని పిలుపునిచ్చారు. ప్రజలకు వారి ఇంటి చుట్టు ప్రక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదే విధంగా కాచి వడబోసిన నీళ్లను తాగాలని, జ్వరం రెండు మూడు రోజుల కంటే ఎక్కువ ఉంటే వెంటనే ప్రభుత్వ దవాఖానాకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. దోమలతో వ్యాధులు వ్యాపిస్తాయని, వాటితోనే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా తదితర వ్యాధులు వస్తాయని వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. దోమ తెరలు, జాలీలు వాడడం, నిండుగా వస్త్రాలు ధరించడం, స్ప్రేలు వాడడం, రసాయనాలతో పొగ పెట్టడం, ఇళ్లలో క్రిమిసంహారక మందులు చల్లడం ద్వారా దోమలు వ్యాప్తి చెందవన్నారు.



దోంగ్లీలో..

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివి

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ: ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ ఎస్‌ఎంబీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి ప్లీనరీ నిర్వహించారు. ప్లీనరీకి స్పీకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను స్పీకర్ హోదాలో రాలేనని, నియోజకవర్గ ఎమ్మెల్యేగా మాత్రమే ప్లీనరీకి హాజరయ్యానని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశంలోనే ఇతర రాష్ట్రాలక ఆదర్శంగా నిలుస్తోందని, పక్క రాష్ట్రాల ప్రజలు కూడా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు కావాలని అడుగుతున్నారని, లేకపోతే తమ ప్రాంతాలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ దయతో 2014 తర్వాత బాన్సువాడ నియోజకవర్గానికి రూ.10 వేల కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. బాన్సువాడలో జరిగిన అభివృద్ధిపై ఎవరైనా విమర్శలు చేస్తే వారికి ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాల నిధుల వివరాలు కార్యకర్తలు తెలపాలని సూచించారు. అంతకుముందు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి చిత్ర పటానికి పూలమాల వేశారు. 14 అంశాలపై తీర్మానాలు చేసి ఆమోదం తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి, పాత బాలకృష్ణ, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న భాస్కర్‌రెడ్డి, పక్కన స్పీకర్

ఇచ్చిన హామీలు నెరవేర్చండి



దోమకొండ: మండల కేంద్రంలో సీపీఐ నాయకులు మంగళవారం జీపుజాత నిర్వహించారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు జీపుజాత నిర్వహించినట్లు జిల్లా కార్యదర్శి దశరథ్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, లక్ష ఉద్యోగాలు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మాచారెడ్డి మండల కేంద్రంలో..

మాచారెడ్డి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథం డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఇసాయిపేట నుంచి గజ్యానాయక్ తండా చౌరస్తా వరకు నిర్వహించిన ఆటో జాత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ...పెరిగిన నిత్యావసర సరకులు, ఇంధన ధరలను తగ్గించాలని కోరారు.

బోనాల పండగ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గంగమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి గంగమ్మ ఆలయం వరకు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించి పిల్లాపాపలు, పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

నివాళులు

కామారెడ్డి అర్బన్/భిక్కనూరు: ప్రసిద్ధ సాహితీవేత్తలు ఆచార్య రవ్వ శ్రీహరి, ఆచార్య గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తిల మరణం సాహితీ లోకానికి తీరని లోటని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య అన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే భిక్కనూరు తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో సంతాప సభ నిర్వహించారు.

అమరుల త్యాగం వెలకట్టలేనిది

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమర వీరుల త్యాగం వెలకట్టలేనిదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ సాధనలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రైతు చట్టం, విద్యా విధానం, పల్లెప్రగతి, పట్టణ ప్రగతితో పాటు మరో మూడు అంశాలకు సంబంధించిన వాటిని సదాశివనగర్, నాగిరెడ్డిపేట, లింగంపేట జెడ్పీటీసీలు నర్సింలు, మనోహన్‌రెడ్డి, శ్రీలత, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావులు సమావేశంలో ప్రవేశ పెట్టగా, లింగంపేట మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డిలు బలపరిచారు. అనంతరం తీర్మానాలు ఆమోదం తెలుపుతూ బీఆర్‌ఎస్ నాయకులు చప్పట్లతో ఆమోదించారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ శ్రీధర్, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): అర్హులైన బీడీ కార్మికులు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో బీడీ కార్మికులు, మహిళలతో మాట్లాడారు. నిరుపేదలకు, బీడీ కార్మికులకు 120 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. మండల కేంద్రంలో 15 సంవత్సరాల క్రితం పోలీస్ స్టేషన్ ప్రక్కన 200 మంది బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, మళ్లీ స్వాధీనం చేసుకున్నారన్నారు. నేడు ఆ స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. కార్మికులు సావిత్రి, ధన లక్ష్మి, మంజుల, స్వాతి, నాగయ్య, తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకట్‌గౌడ్

ప్రైవేటీకరణ చేయడం ఆపండి

బాన్సువాడ : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం ఆపాలని బీజేపీ ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మ డిమాండ్ చేశారు.. మంగళవారం బాన్సువాడలో బీజేపీ హటావో దేశ్‌కు బచావో నినాదంతో సీపీఐ చేపట్టిన ఇంటింటికి సీపీఐ, ప్రజల వద్దకు సీపీఐ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన సభలో ఆమె ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్, బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ దుబాస్ రాములు, విఠల్‌గౌడ్, గంగాధర్, తదితరులు ఉన్నారు.



గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దాం

- చేసిన అభివృద్ధి వివరించి ప్రజలకు భరోసా కల్పిద్దాం
- ప్లీనరీలో కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద(జుక్కల్): బీఆర్‌ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవద్దని, అందరం కలిసికట్టుగా ఉందామని, గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్దామని ఎమ్మెల్యే హన్మంత్ సింధే కార్యకర్తలకు పిలునిచ్చారు. బిచ్కుందలో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ప్లీనరీలో మాట్లాడారు. చేసిన అభివృద్ధి గురించి వివరించి బీఆర్‌ఎస్‌పై భరోసా కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో త్వరలో 9 కొత్త సబ్‌స్టేషన్‌లు మంజూరు కానున్నాయని తెలిపారు. కాళేశ్వరం నీళ్లు నిజాంసాగర్‌కు తీసుకొచ్చామని అన్నారు. రూ.570 కోట్లతో నాగమడుగు ప్రాజెక్టు కట్టుకుంటున్నామని వ్యాఖ్యానించారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించిన విషయం ప్రతి ఒక్కరికీ వివరించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం

బీజేపీ, కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. చేసిన అభివృద్ధి పనుల ఫోటోను షేర్ చేసి బీఆర్‌ఎస్ నాయకులు వారి కళ్లు తెరిపించాలని కార్యకర్తలను సూచించారు. అనంతరం పది తీర్మానాలు చేశారు. వ్యవసాయం, సామాజిక భద్రత, మహిళ సాధికారత, బీసీ, దళిత, గిరిజన సంక్షేమ, విద్య, ఉద్యోగం, పల్లె, పట్టణ ప్రగతి, మైనార్టీ వెల్ఫేర్, ధరల పెగుదల, మోదీ వైఫల్యం పై తీర్మానాలు చేశారు. జెడ్పీ చైర్మన్ దఫేదార్ శోభ, మాజీ జెడ్పీ చైర్మన్ దఫెదార్ రాజు, ఎంపీపీలు అశోక్ పటేల్, ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ భారతి, తదితరులున్నారు.

ప్రజల్ని కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నాం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్: ప్రజలందరిని కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నామని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కేవీఎస్ గార్డెన్‌లో ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంపై, పీఎం నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షాలపై మండిపడ్డారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన ఉత్తమ గ్రామ పంచాయతీ 40 అవార్డులలో 13 తెలంగాణలోని గ్రామాలకు వచ్చాయని, మరి బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎందుకు రాలేవని ప్రశ్నించారు. అవార్డులు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలో అవినీతి పాలన అంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

దేశమంతా తెలంగాణ వైపే: ఎమ్మెల్సీ దండు

దేశం అంతా తెలంగాణ వైపు చూస్తుందని, దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ నిలవబోతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ రాబోతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ పాల్గొన్నారు.



అమర వీరులకు నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



గున్కుల్‌లో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ శోభ



భిక్కనూరులో..

భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) ఆవిర్భావ వేడుకలు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న పథకాలు, వాటి అమలు తీరు గురించి ప్రజలకు వివరించారు.

– సాక్షి, నెట్‌వర్క్



బోర్లంలో..



తాడ్వాయిలో..

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గాంధారి(ఎల్లారెడ్డి): మారు మూల గ్రామంలో ఏర్పాటు చేస్తున్న తపాల శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ జిల్లా పర్యవేక్షకులు ఉమామహేశ్వర్ అన్నారు. దుర్గంలో మంగళవారం ఆయన నూతన తపాల శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తపాల శాఖ ద్వారా మునుపటి కంటే ఎక్కువ సేవలను అందిస్తున్నామన్నారు. తపాల శాఖలో పొదుపు ఖాతాలతో పాటు పలు రకాల సేవలందిస్తున్నామని తెలిపారు.



వైభవంగా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణం



దోమకొండలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దోమకొండ: మండల కేంద్రంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. రాత్రి అమ్మవారికి మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనాలను తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఆలయకమిటీ ప్రతినిధులు సుదర్శన్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



శారదామాత ఆలయంలో..

ఆదిశంకరాచార్యుల జయంతి

కామారెడ్డి అర్బన్: జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా కామారెడ్డి తూర్పు హౌజింగ్ బోర్డుకాలనీలోని శారదామాత ఆలయం, దేవునిపల్లి వీర బ్రహ్మంగారి దేవాలయం, ఆర్‌బీనగర్ కాలనీ ఇష్టకార్యసిద్ధి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శిర్లవంచ కృష్ణమాచార్యులు, వేద పండితుడు జొన్నాజు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

108 రకాల పండ్లతో కాలభైరవుడికి అలంకరణ



రామారెడ్డి(ఎల్లారెడ్డి): ప్రముఖ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయంలో వైశాఖమాస పూజలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి మంగళవారం 108 రకాల పండ్లతో కాలభైరవుడిని అలంకరించారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో 4 వారాల పాటు వివిధ రూపాల్లో భక్తులకు కాలభైరవుడు దర్శనం ఇవ్వనున్నట్లుగా ఆల య ఈవో ప్రభుగుప్తా తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అర్చకులు రాచర్ల శ్రీనివాసశర్మ, వంశీ శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

రాజంపేట: మండల కేంద్రంలో గత సంవత్సరం పట్టు రవీందర్ ఫోటో స్టూడియోతో దొంగతనానికి పాల్పడిన నిందితుడు దుబ్బాక మండలానికి చెందిన అందోల్ నవీన్‌కు కామారెడ్డి కోర్టు రూ.200 జరిమానాతో పాటు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట, కన్నాపూర్, పోతాయిపల్లి, సజ్జన్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. ఏపీఎం శ్రీనివాస్, సర్పంచులు పోచయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం..

రాజంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని రాజంపేట సర్పంచ్ ఆముద సౌమ్య ప్రారంభించారు. వైస్ ఎంపీపీ దుబ్బని సావిత్రి, ఎమ్మార్వో శాంత, ఎంపీడీవో బాలకిషన్, బీఆర్‌ఎస్ నేత బల్వంతరావ్, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

భిక్కనూరు: సిద్ధరామేశ్వర నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ ప్రారంభించారు. వైద్యురాలు యెమిమా, ఉప సర్పంచ్ లత సుధాకర్ పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్‌లో చలివేంద్రం..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం చలివేంద్రాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ ప్రారంభించారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు తన తండ్రి దఫేదార్ కిషన్ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ దఫేదార్ బాలమణి నాయకులు సత్యనారాయణ, దుర్గారెడ్డి, గంగారెడ్డి, తదితరులున్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ మెడివిజన్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. 50 మంది పరీక్షలు చేయించుకున్నారు. సంఘం ప్రతినిధులు ఉపేందర్, అర్జున్‌రావు, శ్యాంరావు పాల్గొన్నారు.

తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడండి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వేసవిలో గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీ మాధవి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో నారాయణ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి యజ్ఞం

ఎల్లారెడ్డి: అడివిలింగాలలో మంగళవారం వీరబ్రహ్మేంద్ర స్వామి వారి యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మాల ధరించిన స్వాములు యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి అంజయ్య, మాలా ధారణ చేసిన స్వాములు ఉన్నారు.

ఇళ్లస్థలాలివ్వాలి

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు.